క్లుప్తంగా

జీజీ కాలేజీ పీజీ ఫలితాల విడుదల



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ కళాశాలో బుధవారం పీజీ ఫలితాలు విడుదల చేశారు. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి సంపత్ కుమార్, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఈఫలితాలను విడుదల చేశారు. పీజీలో ఎంఏ ,ఎంకాం ఎంఎస్సీ, బీఎల్ఐఎస్సీ, రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు వారు తెలిపారు, నాలుగో సెమిస్టర్ ఫైనల్ ఫలితాల్లో 89.91 శాతం, రెండవ సెమిస్టర్ లో 81.47శాతం ఫలితాలు వచ్చాయని వారు పేర్కొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్ నాగారం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ - రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని నాందేవ్‌వాడలో పెన్షనర్ల భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిటైర్డ్ ఉద్యోగులపై వివక్షతను ప్రదర్శిస్తూ, ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఇందుకు నిరసనగా శుక్రవారం పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈసమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఈవీఎల్ నారాయణ, ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి సాంబశివరావు, జిల్లా నాయకులు జార్జ్, లలిత, లావు వీరయ్య, లక్ష్మీనారాయణ, బాల దుర్గయ్య, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



సిరికొండ: వన్యప్రాణులను సంరక్షించాలని, వన్యప్రాణులతోనే మానవ మనుగడ అని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్ నర్సయ్య తెలిపారు. మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వన్యప్రాణుల ప్రాధాన్యతపై నిర్వహించిన వ్యాసరచనం, చిత్రలేఖనం, నాటికల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గ్రీన్‌కోర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని గాయత్రినగర్ ఏరియాలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ (ఓపీ) ఆర్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాయత్రినగర్, ఆకుల పాపన్న రోడ్డు, విశ్వవికాస్ స్కూల్ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చేందుకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని చంద్రశేఖర్ తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,28,200	వెండి(కిలో)	1,63,000
22 క్యారెట్స్	1,18,585		- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	220
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	80
బీరకాయ	50	100	దోసకాయ	30	60
దొండకాయ	50	100	ఆలుగడ్డ	30	60
బీర్నీసుకాయ	100	180	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	100
వంకాయ	40	80	బీట్‌రూట్	40	80
పాలకూర	80	160	కరివేపాకు	40	80
మెంతికూర	100	180	చామగడ్డ	30	60
కొత్తిమీర	80	160	చిక్కుడుకాయ	50	100
పుదీనా	50	100	గోరుచిక్కుడు	60	140
క్యాప్సికం	50	100			-సుభాష్‌నగర్

విధుల్లో నిర్లక్ష్యం


మున్సిపల్ కార్పొరేషన్

- వార్డు ఆఫీసర్లపై చర్యలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్
- ఒకరి సస్పెండ్, ముగ్గురు వార్డు ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు

నిజామాబాద్ సిటీ: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఒక వార్డు ఆఫీసర్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సస్పెండ్ చేశారు. మరో ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. డివిజన్ల వారీగా రివ్యూ చేసినప్పుడు పనుల్లో మెరుగైన ఫలితాలు లేకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రెండుగంటలపాటు సుదీర్ఘంగా రివ్యూచేశారు. డివిజన్ల వారీగా, వార్డు ఆఫీసర్ల డ్యూటీచార్ట్‌ను పరిశీలించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పురాని వార్డు ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు. మరో ముగ్గురికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సరియైన వివరణ రెండు రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ దిలీప్‌కుమార్ హెచ్చరించారు. నగరంలోని 60 డివిజన్లకు గాను 60 మంది వార్డు ఆఫీసర్లను నియమించారు. వీరిలో కొత్తగా నియామకమైన 28 మందితోపాటు జూనియర్‌అసిస్టెంట్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, బిల్లు కలెక్టర్లున్నారు.

డివిజన్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలి..

వార్డు ఆఫీసర్లు వారికి కేటాయించిన వార్డుల్లో ఉంటూ డివిజన్ల పరిధిలోని సమస్యలు పరిష్కరించాలి. కొత్త ట్రేడ్ లైసెన్సులు ఇవ్వడం, పాతవాటిని రెన్యూవల్ చేయడం, కొత్తగా నిర్మించిన నిర్మాణాలను ఇంటినంబర్లు కేటాయింపు, ధృవీకరణ పత్రాల్లో తప్పుల సవరణలతోపాటు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన పనులు సైతం నిర్వహించాలి.

డ్యూటీకి డుమ్మాలు..

60 మంది వార్డు ఆఫీసర్లలో కొంతమంది జిల్లాకేంద్రంలో నివాసముండకుండా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారు. వీరిలో కొంతమంది డ్యూటీలు సక్రమంగా చేయడం లేదు. వీరు రెవెన్యూ ఆఫీసర్‌కు రిపోర్టు చేయాలి. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టీపీఆర్‌వో రమేష్‌కు రిపోర్టు చేయాలి.కొంతమంది అసలు డ్యూటీలు చేయకుండా నెల నెలా వేతనాలు పొందుతున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా డ్యూటీకి డుమ్మా కొడుతున్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు


మాధవనగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజేంద్ర కుమార్

నిజామాబాద్ రూరల్ : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని, దళారులను ఆశ్రయించొద్దని ఆర్డీవో రాజేంద్రకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాధవనగర్ ప్రాథమిక సహకార సంఘ పరిధిలోని ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2389, బీ గ్రేడ్ రకానికి రూ. 2369 ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. మాధవనగర్ సొసైటీ పరిధిలోని రైతులు గత రబీ, ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌ను అందించాలని ఆర్డీవోను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో సమాధానమిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ నాగేశ్వర్ రావు, సంఘం డైరక్టర్లు, సీఈవో వంశీకృష్ణ రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి


వినతిపత్రం అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలలో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జోనల్ అధ్యక్షుడు ఎస్పీ నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జోనల్ కార్యాలయం వద్ద ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్‌రావు ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరేష్ మాట్లాడుతూ.. గత మూడు నెలల నుంచి జీతాలు లేక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులైన అటెండర్లు, వాచ్‌మెన్లు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీతాలు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభ్యులు సుమన్, కిరణ్, పద్మ, రోజా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలి


మాట్లాడుతున్న పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లో ఎలాంటి విబేధాలకు తావు లేకుండా ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్ నాయకులు సూచించారు. బుధవారం మండలకేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో రూరల్ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసింది. ఈసమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మోపాల్ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానంపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని, ఎవరైనా పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని, మిగతా వారికి నామినేటెడ్, పార్టీ పదవుల్లో అవకాశం కల్పిస్తామని హామీనిచ్చారు. అనంతరం గ్రామాల వారీగా ఎంపీటీసీ స్థానం, అలాగే జెడ్పీటీసీ స్థానాన్ని ఆశిస్తున్న వారి ఆశావహుల పేర్లను నమోదు చేసుకున్నారు. అంతకుముందు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను వ్యక్తపర్చారు. సమావేశంలో కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మునిపల్లి సాయిరెడ్డి, కంచెట్టి గంగాధర్, బాబురావు, మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పరామర్శించిన దినేశ్



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి పరామర్శించారు. గత నెల 29న భూపతి రెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ మృతిచెందిన విషయం తెలిసిందే.రేకులపల్లి లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎంపీపీ అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ పద్మరెడ్డి,బీజేపీ జిల్లా కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నక్క రాజేశ్వరి,బీజేపీ నాయకులు,బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ

నిజామాబాద్ సిటీ: మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కోటగల్లి లోని నీలం రామచంద్రయ్య భవన్‌లో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈక్లాసులకు పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ అధ్యక్ష వహించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా అందే మంగ మాట్లాడుతూ. మూఢ నమ్మకాలను వీడాలన్నారు. ఈ సమావేశంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పిట్ల సరిత మాట్లాడుతూ..స్త్రీలు అనేక రంగాలలో ఆర్థిక, రాజకీయ లైంగిక దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. ప్రగతిశీల మహిళా సంఘం నిరంతరం మహిళలు చైతన్యం కావడానికి అనేక సదస్సులను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుప్రియ, జి.సంజన, నీలం లక్ష్మీ, చిట్టెక్క, లక్ష్మీ, రాధ, అనంత, స్వప్న, తదితదిరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


జీజీ కాలేజీలో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

నిజామాబాద్‌అర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై షూ విసిరిన న్యాయవాది రాకేశ్ కిశోర్ పై చర్యలు తీసుకోవాలని జీజీ కాలేజీ ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా కాలేజీలో నల్లబ్యాడ్జి ధరించి అధ్యాపకులు, విద్యార్థులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రంగరత్నం, నహీదబేగం, రంజిత, వినయ్ కుమార్, రామస్వామి, రాహుల్, రామకృష్ణ, బాలామణి, వెంకటేష్ గౌడ్, ఏవో రామ్ కిషన్, సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: సీజేఐ బీఆర్ గవాయిపై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజా పంథా) డివిజన్ కార్యదర్శి ఎం వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం డిచ్‌పల్లి లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) మండల కార్యదర్శి బోశెట్టి మురళి, డివిజన్ నాయకులు సంధ్య, గణేష్, కిషన్, నారాయణ, గంగాధర్, గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నాగారం: సీజేఐ బీఆర్ గవాయిపై దాడికి యత్నించడాన్ని ఖండిస్తున్నామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బంగారు సాయిలు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. న్యాయవాది రాకేశ్ కిశోర్‌ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు హుస్సేన్, కేశ్‌పల్లి రవి, మేకల అశోక్, మాల మహానాడు మహిళా అధ్యక్షురాలు సోనీ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో 105 మంది విద్యార్థులకు రూ.25వేల విలువైన బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులను బుధవారం అందజేశారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి గేమ్‌సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లాటికర్ రాము, వస్త్ర వ్యాపారి నరసింహులు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, సవిత్ర చిట్‌ఫండ్ మేనేజర్ సుదర్శన్, ఉపాధ్యాయులు నరేష్‌రావు, వసంత, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు


న్యావనంది చౌరస్తా సమీపంలో ఉన్న గుంతలు

- సిరికొండ మండలంలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయించాలని వినతి


సిరికొండ-చిన్నవాల్గోట్ గ్రామాల మధ్య..


సర్పల్లి తండా వద్ద..


చిన్నవాల్గోట్ గ్రామ సమీపంలో..

సిరికొండ: మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై మోకాలి కంటే ఎక్కువ లోతు గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై తారు కంకర లేచి పోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. చిన్నవాల్గోట్, పెద్దవాల్గోట్, ముషీర్‌నగర్ తదితర గ్రామాల పరిధిలో రోడ్లు చాలా అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు కొండూర్ వద్ద తెగిపోవడంతో చిన్నవాల్గోట్, పెద్దవాల్గోట్ గ్రామాల మీదుగా రాకపోకలు సాగుతున్నాయి. గుంతలు బాగా లోతుగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు, లారీలకు కూడా కింద తగులుతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. రోడ్లు బాగా దెబ్బతినడంతో ప్రయాణీకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ధాన్యం లారీలు వెళ్లడానికి రోడ్లు సరిగా లేవని, రోడ్లు ఇలాగే అధ్వానంగా ఉంటే ఆయా మార్గాల గుండా లారీలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు. గుంతల్లో కంకర నింపి మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి చక్రతీర్థం


లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి చక్రస్నానంలో కమాండెంట్ సత్యనారాయణ దంపతులు

డిచ్‌పల్లి: మండలంలో ప్రసిద్ధి చెందిన తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి వనవిహారం, చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ సత్యనారాయణ, భవాని దంపతులు, అడిషనల్ కమాండెంట్ సీహెచ్ సాంబశివరావు దంపతులు, అసిస్టెంట్ కమాండెంట్ కేపీ సత్యనారాయణ, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది వారి కుటుంబసభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మానసిక ఆరోగ్యం అవసరం



మోపాల్: ప్రతి వ్యక్తికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం అవసరమని ప్రముఖ సైకాలజిస్ట్ టి కేశవకుమార్ పేర్కొన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సహారా ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య వారోత్సవాల్లోభాగంగా మండలంలోని కులాస్‌పూర్, నగరంలోని శంకర్ భవన్ ఉన్నత పాఠశాలల్లో మెంటల్ వెల్‌నెస్‌పై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కేశవకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం, నీరు తీసుకోవాలని, వాటి నుంచి కొన్ని రకాల మానసిక రుగ్మతలు తగ్గించుకోవచ్చన్నారు. చెడు వ్యసనాల జోలికి వెళ్లొద్దని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ భగవాన్, జోనల్ చైర్మన్ నరసింహం, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

అసభ్యకర పోస్టులు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి: ముస్లింల మక్కా మసీద్ చిత్రపటంపై అసభ్యకర పోస్టులు చేసిన వ్యక్తిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎంఐఎం రూరల్ ఇన్‌చార్జి అబ్దుల్ వకీల్ రిజ్వీ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎంఐఎం నిజామాబాద్ ఈసీ మెంబర్ లతీఫ్ ఖాన్, డిచ్‌పల్లి మండల కమిటీ సభ్యులు గౌసోద్దీన్, రియాజుద్దీన్, షేక్ సలీం, ఇర్ఫాన్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.20వేల విరాళం

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం దుర్గా భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.20వేలను విరాళంగా ఎస్ఐ సుస్మితకు బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మేముసైతం ప్రాజెక్ట్‌లోభాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సేవా సమితి ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సహకరించాలని ఎస్ఐ సుస్మిత కోరారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు అదరంగి భూమయ్య, భూమారావు, వెంకటేష్, నవీన్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్‌గా సంజయ్

నిజామాబాద్ సిటీ: బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీడీఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ గా తలారె సంజయ్ నియమించినట్లు బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ తెలిపారు.. వామపక్ష విద్యార్థి ఉద్యమాల ద్వారా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి సల్పిన అనుభవం ఉన్న సంజయ్ బహుజన వామపక్ష దృక్పథం కలిగిన బీడీఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్మాణం చేస్తారనే విశ్వాసాన్ని దండి వెంకట్ వ్యక్తం చేశారు.

నిజామాబాద్ ఏఎంసీకి విజయ్‌కిశోర్ బదిలీ


విజయ్‌కిషోర్

సుభాష్‌నగర్: గ్రేడ్–1 సెక్రటరీ విజయ్‌కిషోర్‌ను నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి డిప్యుటేషన్‌పై (ఓడీ) బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. నిర్మల్ జిల్లా ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీలో గ్రేడ్–1 సెక్రటరీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం నిజామాబాద్ మార్కెట్ కమిటీలో కీలకమైన గ్రేడ్–2 పోస్టుసైతం ఖాళీగా ఉంది. ముఖ్యంగా సూపర్‌వైజర్లు, వివిధ స్థాయిల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. మరో మూడు నెలల్లో మార్కెట్‌కు పసుపు రానుంది. పసుపు కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా సాగేలా చర్యలపై అధికారులు దృష్టి సారించారు. అందుకోసం అనుభవజ్ఞులైన అధికారి సేవలు వినియోగించుకోవాలని మార్కెటింగ్‌శాఖ భావించింది. ఈక్రమంలో గ్రేడ్–1 సెక్రటరీ విజయ్‌కిశోర్‌ను నిజామాబాద్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయం మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన నేడో, రేపో బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.